సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025



టన్ను చీనీ రూ.21,900

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.21,900, కనిష్టంగా రూ.4 వేలు, సరాసరిన రూ.10 వేల ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.13

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
35.2°/11.3°

జిల్లా పరిధిలో శనివారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

శేష వాహనంపై శ్రీవారి విహారం



శేష వాహనంలో కొండమీదరాయుడు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో కొండమీదరాయుని బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీవారు శేష వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ ఊరేగింపు చేపట్టారు. మహిళలు శ్రీవారికి మంగళ హారతులు పట్టారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆదివారం రాత్రి శ్రీవారిని హనుమద్వాహనంపై ఊరేగించనున్నట్లు అర్చకులు శ్రీనాథ్ స్వామి పేర్కొన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష



లేపాక్షి: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11వ తరగతిల్లో ప్రవేశం కోసం శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 9వ తరగతిలో ప్రవేశం కోసం 1,084 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 849 మంది పరీక్షకు హాజరయ్యారు. 135 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా హిందూపురంలోని నాలుగు కేంద్రాల్లో నిర్వహించిన 11వ తరగతి ప్రవేశ పరీక్షకు 1,228 మందికిగాను 919 మంది విద్యార్థులు హాజరయ్యారు. మరో 309 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష నిర్వహించడంలో సహకరించిన జిల్లా విద్యాశాఖ అధికారులకు, పోలీసు సిబ్బందికి జవహర్ నవోదయ ప్రిన్సిపల్ నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

10న మడకశిరలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

మడకశిర/అమరాపురం: మడకశిర తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 10వ తేదీన జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్లు కరుణాకర్, లక్ష్మీనరసింహ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకూ కార్యక్రమం ఉంటుందన్నారు. కలెక్టర్ టీఎస్ చేతన్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారని, సమస్య ఉన్న వారు అధికారులకు అర్జీలు సమర్పించవచ్చన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్జీలో ఆధార్, ఫోన్ నంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.

పైసలిస్తేనే ప్రసాదం



ఎక్సైజ్ శాఖలో పని చేసే ఓ అధికారికి గత అక్టోబరులో పదోన్నతి లభించింది. పెరిగిన వేతనం ఇప్పటికీ అందడం లేదు. ఆరా తీస్తే వేతనం పెంపు ఫైలు ట్రెజరీలో ఉండిపోయింది. ట్రెజరీ ఆఫీసుకెళ్లి అధికారిని అడిగితే... రూ.20 వేలు ఇస్తే పని అయిపోతుందని సమాధానం ఇచ్చారు. దీంతో ఎక్సైజ్ అధికారి అవాక్కయ్యాడు.

పోలీసుశాఖలో పని చేసే ఓ మహిళా ఉద్యోగి.. పదవీ విరమణ పొందిన తర్వాత పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ట్రెజరీలో అధికారి నాలుగు మద్యం బాటిళ్లు అడగడంతో ఆమె తరఫున ఓ వ్యక్తి ఇచ్చి వెళ్లాడు. అయితే తనకు విస్కీ బ్రాండ్లు నచ్చవని.. బ్రాందీ తెచ్చి ఇవ్వాలని అడిగాడు. తప్పనిసరి పరిస్థితుల్లో బ్రాందీ బాటిళ్లు నాలుగు అప్పజెప్పినట్లు తెలిసింది.

ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు గతేడాది జూన్‌లో పదవీ విరమణ పొందాడు. అయితే ఇప్పటి వరకు పింఛన్ ప్రపోజల్ కొలిక్కి రాలేదు. జిల్లా ట్రెజరీ శాఖలో ఓ అధికారి రూ.50 వేలు డిమాండ్ చేసినట్లు బాధితుడు వాపోయాడు. అయితే తాను ఇప్పటికే పలు దఫాలుగా రూ.20 వేల వరకు ఇచ్చినట్లు పేర్కొన్నాడు. కానీ ఇప్పటికీ పింఛన్ మంజూరు కాలేదని తెలిపాడు.

జిల్లా ఖజానా శాఖలో పని చేసే ఓ అధికారి తీర్థ'ప్రసాద'ం అందనిదే ఏ పనీ చేయడం లేదు. ప్రతి పనికీ ఓ రేటు ఫిక్స్ చేసి.. దండుకుంటున్నాడు. విశ్రాంత ఉద్యోగులనూ తీవ్రంగా వేధిస్తున్నాడు. ఆయనకు రూ.పది వేలు ఇస్తే కానీ ఫైలు ముందుకు కదలదని ఉద్యోగులు, పింఛనర్లు వాపోతున్నారు. పనికోసం కార్యాలయానికి వెళితే బేసిక్ శాలరీ ఆధారంగా పర్సెంటేజీలు ఫిక్స్ చేస్తున్నారని మండిపడుతున్నారు.

- ఖజానా శాఖలో లంచావతారం
- ఫైలు కదలాలంటే మనీ, మద్యం ఇవ్వాల్సిందే
- అధికారి దెబ్బకు ఆర్నెల్లుగా ఎందరికో ఇబ్బందులు
- బేసిక్ జీతం ఆధారంగా పింఛనర్ల నుంచి డబ్బులు డిమాండ్
- ఒక్కోశాఖ ఉద్యోగులకు ఒక్కో రకమైన డిమాండ్లు



సాక్షి, పుట్టపర్తి

ఖజానా (ట్రెజరీ) శాఖ.. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాల ఫైళ్లన్నీ ఇక్కడే ఉంటాయి. ఆ శాఖ ఉద్యోగులు ఫైలు పంపితేనే పింఛన్, ఇంక్రిమెంట్, ఇతర ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయి. ఇంతటి కీలకమైన శాఖలోని ఉన్నతాధికారి ఒకరు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులను లంచం కోసం పీడిస్తున్నాడు. లంచం ఇస్తే గానీ ఫైలు ముందుకు కదలనివ్వడం లేదు. ఏ రకమైన పింఛన్ అయినా సరే చేయి తడపాల్సిందేనని తేల్చిచెబుతున్నాడు.

ఫ్యామిలీ పింఛన్‌కు పాతికవేలు!

ఖజానా శాఖలోని లంచావతారం ఒక్కో పనికి ఒక్కో రేటు ఫిక్స్ చేశాడు. చివరకు ఎవరైనా ఉద్యోగి మృతి చెందితే ఆ కుటుంబానికి అందించే ఫ్యామిలీ పింఛన్‌కూ రేటు నిర్ణయించాడు. కనీసం పాతిక వేలు ఇస్తేనే ఫైలు పెడతానంటూ కరాఖండీగా చెబుతున్నాడు. ఇతర పనులకూ అదే రకంగా వసూలు చేస్తున్నాడు. మనీతో పాటు మద్యం బాటిళ్లు డిమాండ్ చేస్తున్నాడు. లంచం ఇవ్వలేని విశ్రాంత ఉద్యోగులు ఆర్నెళ్లుగా ఖజానా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా వారివైపు కన్నెత్తి చూడటం లేదు. ఇక పదోన్నతి పొందిన వారు పర్సెంటేజీల రూపంలో 'మామూళ్లు' ఇస్తేనే.. పెరిగిన వేతనం జమ అవుతోంది. లేదంటే.. అరియర్స్ రూపంలో తర్వాత వస్తుందిలే అంటూ నాన్చుతున్నారు. కనీసం రూ.పది వేలు ఇవ్వనిదే.. ఫైలు కదలడం లేదనే ఆరోపణలున్నాయి.

పర్సెంటేజీలో చుక్కలు చూపిస్తూ..

నాల్గో తరగతి ఉద్యోగులు, పోలీస్ కానిస్టేబుళ్లు, మున్సిపల్ సిబ్బంది పదవీ విరమణ పొందిన సమయంలో.. అలాగే ఇతర అన్ని కేటగిరీ ఉద్యోగులు, అధికారులు పదవీ విరమణ చేసినప్పుడు స్టేట్ ఆడిట్ నుంచి సర్వీస్ పింఛన్ ప్రపోజల్స్ జిల్లా ఖజానా శాఖకు వస్తాయి. పింఛన్, పింఛన్ అరియర్స్, కమిటేషన్, గ్రాట్యుటీ వంటివి రూ.20 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తం చెల్లించడానికి ఖజానా శాఖలో పని చేసే కొందరు సిండికేటుగా మారి లంచాలు వసూలు చేయడం మొదలుపెట్టారు. పెరిగిన వేతనం, రావాల్సిన అరియర్స్ ఆధారంగా పర్సెంటేజీలు నిర్ణయించి చుక్కలు చూపిస్తున్నారు. చేయి తడపకుంటే సాంకేతిక సమస్యలు ఉన్నాయంటూ జాప్యం చేస్తున్నారు.

ఆర్నెల్లు గడిచినా.. అతీగతీ లేదాయె..

జిల్లా ట్రెజరీ కార్యాలయానికి చేరిన పింఛన్ ప్రపోజల్స్‌ను 15 రోజుల్లో సబ్ ట్రెజరీకి పంపాల్సి ఉంటుంది. అయితే అక్రమార్జనకు అలవాటు పడిన అధికారులు సిండికేట్‌గా మారి..ఒకరిని ముందుకు నెట్టి.. వసూలు చేయడం పరిపాటిగా మారింది. ముడుపులు చెల్లించని వారి ఫైల్స్ అటకెక్కిస్తున్నారు.

రూ.లక్షల్లో జీతం..అయినా లంచావతారం..

ట్రెజరీలో పని చేసే ఉద్యోగులకు డిసిగ్నేషన్, సీనియారిటీ ఆధారంగా రూ.70 వేల నుంచి రూ.2 లక్షల వరకు జీతాలుంటాయి. అయినా వారు లంచాలు డిమాండ్ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మా దృష్టికి రాలేదు



ఖజానా శాఖలో అక్రమాలకు తావే లేకుండా విధులు నిర్వర్తిస్తున్నాం. సిబ్బంది లంచాలు తీసుకుంటున్నట్లు మా దృష్టికి రాలేదు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే మా దృష్టికి తీసుకువస్తే విచారించి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తాం. లంచం అడగడం.. తీసుకోవడం రెండూ నేరమే.

– నాగమల్లిక, జిల్లా ఖజానా అధికారి

కారు బోల్తా .. మహిళ మృతి

- స్వల్ప గాయాలతో బయటపడ్డ మరిది, మరో వ్యక్తి
- బంధువుల పెళ్లికి చీరలు కొని తెచ్చుకునేందుకు వెళ్తుండగా ప్రమాదం



మృతురాలు మహేశ్వరి (ఫైల్)

వెల్దుర్తి: కారు అదుపుతప్పి బోల్తా పడటంతో ఓ మహిళ మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన సూదేపల్లె , మంగంపల్లె మధ్య జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు... శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం గుమ్మలకుంటకు చెందిన పవన్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. భార్య మహేశ్వరి, ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో జీవనం సాగిస్తున్నారు. బంధువుల ఇంట్లో పెళ్లి ఉండడంతో ధర్మవరంలో చీరలు కొనేందుకు మహేశ్వరి తన మరిది అమర్‌నాథ్ రెడ్డి, మరో బంధువు అక్షయ్‌తో కలిసి శనివారం కారులో హైదరాబాద్ నుంచి బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు వెల్దుర్తి మండలంలోని సూదేపల్లె, మంగంపల్లె మధ్య జాతీయ రహదారిపై అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో కారు వెనుకసీట్లో ఉన్న మహేశ్వరి డివైడర్ మధ్యలో పడిపోయి.. తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. అమర్‌నాథ్ రెడ్డి, అక్షయ్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాద విషయం తెలుసుకున్న హైవే పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని, క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో వెల్దుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు, డివైడర్ మధ్య మహేశ్వరి మృతదేహం

హంసవాహనంపై వేంకటరమణుడు



విశేష పుష్పాలంకరణలో పేట వేంకటరమణస్వామి మూలవిరాట్



శ్రీదేవి భూదేవితో కలిసి హంస వాహనంపై ఊరేగుతున్న పేట వేంకటరమణస్వామి

హిందూపురం: మెయిన్ బజారులోని పేట వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం మాఘశుద్ధ బీష్మా ఏకదశిని పురస్కరించుకుని స్వామివారు తన దేవేరులు శ్రీదేవి, భూదేవి సమేతంగా హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు ఉదయం మూలవిరాట్‌కు అర్చకులు పంచామృభిషేకాలు చేశారు. వివిధ పుష్పాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయ ముఖమండపంలో కొలువుదీర్చి పూజలు చేసి ప్రాకారోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి సహస్ర దీపాలంకరణ సేవా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణస్వామిని హంస వాహనంపై కొలువుదీర్చి మేళతాళాలతో నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

- నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ రత్న





మాట్లాడుతున్న ఎస్పీ రత్న, సమావేశానికి హాజరైన పోలీస్ అధికారులు

పుట్టపర్తి టౌన్: జిల్లాలో నేర నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ రత్న పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. గ్రేవ్, నాన్ గ్రేవ్, ఆస్తి సంబంధిత నేరాలు... రికవరీలు గురించి ఆరా తీశారు. పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ రత్న మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యంతో నిఘా వ్యవస్థను పటిష్టం చేసి నేరాలను కట్టడి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నారులు, మహిళలపై దాడులకు సంబంధించిన కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ ఆదేశించారు. పోక్సో కేసుల్లో నిర్ణీత గడువులోపు దర్యాప్తు పూర్తి చేసి సరైన ఆధారాలు కోర్టుకు సమర్పించాలని సూచించారు. మిస్సింగ్ కేసుల్లో ఫిర్యాదు అందిన వెంటనే దర్యాప్తు ప్రారంభించాలన్నారు. అలాగే సీసీ కెమెరాల ప్రాముఖ్యత ప్రజలకు తెలియజేసి ఏర్పాటు చేసుకునేలా చూడాలని సూచించారు. రోజూ ఉదయం, సాయంత్రం విజుబుల్ పోలీసింగ్ ద్వారా ప్రధాన కూడళ్లలో వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. రౌడీషీటర్లపై నిఘా ఉంచడంతో పాటు అనుమానిత వ్యక్తుల వివరాలు సేకరించాలని సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సరిహద్దు చెక్ పోస్టులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, వచ్చివెళ్లే వాహనాలపై దృష్టి సారించాలన్నారు. ప్రధాన పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. 'పల్లె నిద్ర' కార్యక్రమాలు చేపట్టి ఆయా గ్రామాల్లోని సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు విజయకుమార్, మహేష్, హేమంత్ కుమార్, ఆదినారాయణ, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు, సైబర్ సెల్ సీఐ తిమ్మారెడ్డి, డీటీఆర్‌బీ సీఐ సతీష్, స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ ప్రదీప్ కుమార్, ఐటీ కోర్ టీం ఇన్‌చార్జ్ సుదర్శన్ రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తిలో దాహం.. దాహం



ప్రైవేటు ట్యాంకరు వద్ద నీటిని కొనుగోలు చేస్తున్న పుట్టపర్తి వాసులు

- నిలిచిన రక్షిత తాగు నీటి సరఫరా
- బకాయిలు చెల్లించకపోవడంతో ఆగిన 'సత్యసాయి' నీరు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న జనం
- ఐదురోజులైనా పట్టించుకోని అధికారులు

పుట్టపర్తి రూరల్: జిల్లా కేంద్రం పుట్టపర్తిలో తాగు నీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలో 2, 3, 4, 6, 7 వార్డుల్లో ఐదు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లలో ఉంటున్న వారి అవస్థలు అన్నీ ఇన్నీ కావు.

పైప్‌లైన్ పగిలిపోవడంతో సమస్య..

పుట్టపర్తి పట్టణానికి నీటి సరఫరా కోసం 40 ఏళ్ల క్రితం చిత్రావతి గుట్టపై వాటర్‌ట్యాంక్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి పట్టణానికి మున్సిపల్ ఆధ్వర్యంలో ఓ పైప్‌లైన్, సత్యసాయి వాటర్ సప్లయ్ ఆధ్వర్యంలో మరో పైప్‌లైన్ వేశారు. ట్యాంకు ఒకటే అయినా ఈ రెండు పైప్‌లైన్ల ద్వారా పట్టణానికి తాగునీరు సరఫరా జరుగుతూ ఉండేది. ప్రస్తుతం మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన పైప్‌లైన్ పగిలిపోవడంతో తాగునీటి సమస్య ఉత్పన్నమైంది. మరోవైపు రూ.2 కోట్ల బకాయిలు చెల్లించకపోవడంతో సత్యసాయి నీటి పథకాన్నీ నిలిపివేశారు. దీంతో జనం ఐదురోజులుగా అల్లాడిపోతున్నారు. అయినా సమస్య పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు చొరవ చూపడం లేదు. దీంతో పుట్టపర్తి మున్సిపాలిటీ వివిధ వార్డుల్లోని జనం ఆర్‌ఓ ప్లాంట్‌లకు వెళ్లి నీరు కొనుగోలు చేసే పరిస్థితి నెలకొంది. కొన్నివార్డుల్లో మాత్రం ప్రజాప్రతినిధులు సొంత నిధులు వెచ్చించి తాగునీటి సమస్యకు తాత్కాలిక పరిష్కారం చూపుతున్నారు.

గతంలో ఇలాంటి పరిస్థితి లేదు

గతంలో ఎప్పుడు ఇలాంటి పరిస్థితి పుట్టపర్తిలో తలెత్తలేదు. ఐదురోజులుగా మా వార్డుతో పాటు పలు వార్డుల్లో తాగునీరు సమస్య నెలకొంది. సమస్యను సత్వరం పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ అధికారులతో మాట్లాడాం.

– శ్రీలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్

బకాయి చెల్లిస్తే సమస్య పరిష్కరిస్తాం

పుట్టపర్తిలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. మున్సిపాలిటీ పరిధిలో రూ.85 లక్షల మేర నీటి బకాయిలున్నాయి. వాటిని చెల్లిస్తే ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం.

– ప్రహ్లాద్, మున్సిపల్ కమిషనర్

గొట్లూరులో ఉద్రిక్తత

- అంగన్‌వాడీ కేంద్రం స్థలంలో శ్రీకృష్ణదేవరాయ విగ్రహం ఏర్పాటుకు చర్యలు
- అభ్యంతరం తెలిపిన గ్రామస్తులు.. ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు
- గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



విగ్రహం ఏర్పాటుకు తీసిన పిల్లర్ గుంత



ఏడు నెలల క్రితం అంగన్‌వాడీ కేంద్రాన్ని దౌర్జన్యంగా జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం(ఫైల్)

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ధర్మవరం మండలం గొట్లూరు గ్రామంలో శనివారం ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కూల్చి ఆ ప్రాంతంలో శ్రీకృష్ణదేవరాయ విగ్రహం ఏర్పాటుకు కొందరు నేతలు చర్యలు చేపట్టడం..ఇందుకు గ్రామస్తులు అభ్యంతరం తెలపడంతో పరిస్థితి ఉద్రికంగా మారింది. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని విగ్రహ ఏర్పాటు చర్యలను అడ్డుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ చర్యలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

అనుమతుల్లేకుండానే.. అంగన్‌వాడీ కేంద్రం కూల్చివేత

20వేల పైబడి జనాభా ఉన్న గొట్లూరు పంచాయతీలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. రెండు కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తుండగా.. మరొకటి గ్రామ నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ స్థలంలో ఉండేది. గ్రామం నడిబొడ్డున ఉన్న అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరి వర్షాకాలంలో నీరు కారుతుండేది. దీంతో ఐసీడీఎస్ అధికారులు ఈ కేంద్రాన్ని మరో భవనంలో నడుపుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే గొట్లూరు గ్రామం నడిబొడ్డున ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని కొందరు కూల్చేశారు. పంచాయతీ, ఐసీడీఎస్, రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండానే ఆ స్థలంలో శ్రీకృష్ణ దేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఇందుకు గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. శ్రీకృష్ణ దేవరాయల విగ్రహాన్ని మరోచోట ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అయితే విగ్రహ ఏర్పాటుకు సిద్ధమైన వారు గ్రామస్తుల మాటలను పట్టించుకోలేదు. పైగా విగ్రహం ఏర్పాటు పిల్లర్లు తీశారు. దీంతో గ్రామ పెద్దలు తహసీల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కూటమి నేతలు రంగప్రవేశం చేసి విగ్రహ ఏర్పాటుకు అనుకూలంగా వ్యవహరించాలని ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో అటు రెవెన్యూ, ఇటు పోలీసు శాఖ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో గ్రామస్తులు చేస్తూ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో అప్పట్లో విగ్రహం ఏర్పాటు పనులను నిలిపివేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని కూల్చివేసిన సంఘటనలో ప్రమేయం ఉన్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటికి విగ్రహ ఏర్పాటు చర్యలు నిలిచిపోగా, శనివారం మళ్లీ విగ్రహం ఏర్పాటు కోసం పనులను ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని పనులను నిలిపి వేయించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తును ఏర్పాటు చేశారు.

మంత్రి స్పందించాలి

ఇంతపెద్ద గ్రామంలో ఎక్కడైనా శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటు చేయవచ్చని, అలాకాకుండా కేవలం పట్టింపుల కోసమే కొందరు నేతలు అంగన్‌వాడీ కేంద్రం స్థలంలో విగ్రహం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామాల్లో కక్షలకు ఆజ్యం పోసేందుకు ఈ వ్యవహారాన్ని వాడుకుంటున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై మంత్రి సత్యకుమార్, జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

రైతు ఉసురు తీసిన అప్పులు


యోగానంద (ఫైల్)

ముదిగుబ్బ: అప్పులు రైతు ఉసురు తీశాయి.వివరాలిలా ఉన్నాయి. రాఘవపల్లికి చెందిన రైతు యోగానంద(27)కు తనకున్న ఐదు ఎకరాల పొలంతో పాటు కౌలుకు మరికొంత పొలం తీసుకుని వేరుశనగ సాగు చేసేవాడు. సొంత పొలంలో బోర్లకు, వ్యవసాయ పెట్టుబడులకు చేసిన అప్పులు దాదాపు రూ.10లక్షలకు చేరుకున్నాయి. పంటలు కూడా నష్టం రావడంతో అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది శుక్రవారం పొలంలోనే పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించగా.. శనివారం మృతి చెందాడు. ఈయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైతు ఆత్మహత్యాయత్నం


అపస్మారక స్థితిలో పడి ఉన్న శివ

చెన్నేకొత్తపల్లి: భూ వివాదం నేపథ్యంలో మనస్తాపం చెందిన శివ అనే రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన రాముకు సర్వే నంబర్ 403–3ఏలో 3.12 ఎకరాలు 403–5ఏ లో 1.28 ఎకరాలు భూమి ఉంది. పక్కనే సుబ్రహ్మణ్యం అనే రైతుకు 403–3బీ, 403–5బీలో 4.50 ఎకరాల భూమి ఉంది. అయితే సుబ్రహ్మణ్యం సాగు చేసే భూమి రాముకు వస్తుందని.. రాము చేసే భూమి సుబ్రహ్మణ్యంకు వస్తుందని ఇద్దరి మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో రాము సోదరుడు శివ శనివారం పొలం దున్నేందుకు వెళ్లగా సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. మనస్తాపానికి గురైన శివ అక్కడే ఉన్న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే వెంటనే కుటుంబ సభ్యులు వచ్చి అపస్మారకస్థితికి చేరుకున్న శివను చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు విచారణ చేపడతామని రామగిరి సీఐ శ్రీధర్ తెలిపారు.

భారీ చోరీ కేసులో పురోగతి

అనంతపురం: నగరంలో గత నెల 22న జరిగిన భారీ చోరీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. గత నెలలో స్థానిక శ్రీనగర్‌కాలనీకి చెందిన కొండ్రెడ్డి వెంకటశివా రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో రూ.3.50 కోట్ల విలువైన బంగారు, డైమండ్, ఇతర విలువైన ఆభరణాలు, రూ.20 లక్షల సొమ్ము చోరీకి గురైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే దొంగల ముఠాలో ఐదుగురు వెంకటశివా రెడ్డి ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు... చోరీకి పాల్పడింది మధ్యప్రదేశ్‌కు చెందిన వారని ప్రాథమికంగా నిర్ధారించారు. దుండగుల కోసం జల్లెడ పట్టిన ప్రత్యేక బృందాలు తాజాగా ముగ్గురిని పోలీసులు అదుపులో తీసుకున్నట్లు తెలిసింది. దీంతోపాటు మొత్తం సొమ్ములో 60 శాతం రికవరీ చేసినట్లు సమాచారం. తక్కిన వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. కాగా, పోలీసులు ఓ దొంగ కుమారుడిని అదుపులోకి తీసుకున్నా దొంగ మాత్రం దారికి రావడం లేదు.

జిల్లాలో మద్యం విక్రయాలు ఇలా..			
ఎక్సైజ్ స్టేషన్	బీర్లు (కేసుల్లో)	మద్యం (కేసుల్లో)	రాబడి
సీకేపల్లి	5,304	16,229	రూ.11,21,48,965
ధర్మవరం	21,129	65,394	రూ.46,98,98,831
హిందూపురం	12,234	44,543	రూ.31,24,25,330
కదిరి	14,142	41,915	రూ.30,42,95,590
మడకశిర	6,130	24,370	రూ.15,04,25,828
పెనుకొండ	15,612	44,741	రూ.31,89,57,211
పుట్టపర్తి	11,568	35,088	రూ.25,04,15,229
తనకల్లు	6,505	21,080	రూ.14,26,06,321
మొత్తం	92,624	2,93,360	రూ.206,11,73,305



తాగుడు.. దూకుడు

ధర్మవరంలో భారీగా అమ్మకాలు
- ఇప్పటి వరకూ రూ.47 కోట్ల విలువైన మద్యం విక్రయం
- జిల్లా వ్యాప్తంగా మద్యం ద్వారా రూ.206 కోట్ల రాబడి
- కూటమి నేతల ఆధ్వర్యంలో యథేచ్ఛగా బెల్టు షాపులు
- డిమాండ్‌కు అనుగుణంగా ఎమ్మార్పీకి మించి సేల్స్



సాక్షి, పుట్టపర్తి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రాతినిథ్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గంలో మద్యం అమ్మకాలు రాకెట్ వేగంతో దూసుకుపోతున్నాయి. ఈ క్రమంలో మద్యం వ్యాపారాన్ని ఆదాయ వనరుగా మార్చుకుని కూటమి నేతలు భారీగా అక్రమార్జనకు తెరలేపారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా భారీగా మద్యం అమ్మకాలు జరుగుతుండటమే ఇందుకు నిదర్శనం. కొత్త మద్యం పాలసీ అమలులోకి వచ్చిన గతేడాది అక్టోబరు 16 నుంచి ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా రూ.206 కోట్ల విలువ చేసే మద్యం అమ్మకాలు జరిగాయి. అందులో గరిష్టంగా ఒక్క ధర్మవరం పరిధిలోనే రూ.47 కోట్ల విలువ చేసే విక్రయాలు జరగడం గమనార్హం. డిమాండ్‌కు అనుగుణంగా కూటమి నేతలు ఎమ్మార్పీని తుంగలో తొక్కి భారీగా ధర పెంచి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి మద్యం దుకాణం పరిధిలో వందల సంఖ్యలో బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు.

అడ్డుకోవాల్సిన వారే అండగా..

మద్యం అమ్మకాల్లో అక్రమాలను అరికట్టాల్సిన అధికారులే అండగా నిలుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అధిక ధరలకు అమ్మడంతో పాటు విచ్చలవిడిగా బెల్టు షాపులు నిర్వహించి ప్రతి నెలా తమకు మామూళ్లు ఇవ్వాలనే నిబంధనలు తీసుకొచ్చి వ్యవస్థను నాశనం చేస్తున్నారని ధర్మవరం ప్రజలు చెబుతున్నారు. ఏ వీధిన చూసినా బెల్టు దందా కొనసాగుతోంది. దీంతో కుటుంబ కలహాలు, గొడవలు, దొంగతనాలు నిత్యకృత్యమయ్యాయనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇప్పటికే మద్యం బారిన పడిన ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా బలహీనపడి రోడ్డున పడ్డాయి. రెండు నెలల క్రితం బెల్టు షాపుల నిర్వాహకుల మధ్య పోటీ నెలకొని ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది.

కట్టడి చేస్తున్నాం

అనుమతులు పొందిన దుకాణాల్లో మాత్రమే మద్యం విక్రయాలు జరిగాయి. మద్యం అక్రమ వ్యాపారాన్ని పూర్తిగా అరికడుతున్నాం. బెల్టు షాపుల నిర్వాహకులపై ఎక్కడికక్కడ కేసులు నమోదు చేస్తున్నాం.

– గోవిందనాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, పుట్టపర్తి

విచ్చలవిడిగా అక్రమ మద్యం..

జిల్లాలోని 8 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 87 మద్యం దుకాణాలు ఉన్నాయి. తాజాగా మరో 9 కొత్తగా ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే అనుమతులు పొందిన దుకాణాల ద్వారా రూ.206.46 కోట్లు విలువ చేసే మద్యం అమ్మకాలు జరిగాయి. దీనికి అదనంగా గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్న కర్ణాటక, మహారాష్ట్ర, గోవా, హర్యానా మద్యం విలువ లెక్క కడితే మరో రూ.100 కోట్లు దాటవచ్చని అంచనా.

కేంద్ర బడ్జెట్‌పై 14 నుంచి నిరసనలు


మాట్లాడుతున్న రాంభూపాల్

కదిరి టౌన్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆమోదయోగ్యంగా లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ తెలిపారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. శనివారం కదిరిలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ప్రజల కొనుగోలు శక్తి పెంచడానికి ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. నిరుద్యోగ సమస్యల పరిష్కారంపైనా ప్రస్తావన లేదన్నారు. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, సామాజిక సంక్షేమంపై పెట్టిన ఖర్చు గత ఏడాది కంటే తగ్గిందన్నారు. ఉపాధి హామీ పథకానికి అదనపు నిధుల కేటాయింపును విస్మరించిందన్నారు. ధరల పెరుగుదల, జీఎస్టీ పెంపుదలతో దేశ ప్రజలు భారాలు మోస్తున్నారన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, లక్ష్మీనారాయణ, పట్టణ కార్యదర్శి జీఎల్ నరసింహులు, పట్టణ కమిటీ నాయకులు బాబ్జాన్, జగన్మోహన్, ముస్తక్, రామ్మోహన్, రఫి, ఉదయ్, అంజి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ ప్రారంభం


చెస్‌లో తలపడుతున్న క్రీడాకారులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట శ్రీ ఉషోదయ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఏడవ రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. యువర్స్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ టోర్నీలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి దాదాపు 270 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి వై.సుమన్, ఉషోదయ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ చాంద్‌బాషా, హైబ్రో చెస్ అకాడమీ ఆర్గనైజింగ్ కార్యదర్శి జాకీర్ హుసేన్, యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేధా శక్తికి మెరుగులు దిద్దేది ఒక్క చదరంగం క్రీడేనన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో రాణించాలని సూచించారు.

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజకుమార్

రొళ్ల: ఇళ్ల వద్ద బైక్ చేసిన పార్కులను రాత్రివేళ చోరీ చేసే ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను రొళ్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ వీరాంజనేయులుతో కలిసి మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్ విలేకరులకు వెల్లడించారు. అగళి మండలం కేంద్రానికి చెందిన ప్రసన్నకుమార్‌తో పాటు కర్ణాటక రాష్ట్రం కిత్తగళికి చెందిన వసంతకుమార్ స్నేహితులు. వీరు రొళ్లలో ఓ దోసకాయల కంపెనీలో పనిచేస్తున్నారు. రాత్రిపూట అగళి, రొళ్ల, గుడిబండ మండలాల్లో రైతులు విడిపించిన దోసకాయలను సేకరించడం కోసం బొలెరో వాహనంలో వెళ్లేవారు. దోసకాయలను కంపెనీ వద్ద అన్‌లోడ్ చేసిన తర్వాత అర్ధరాత్రి గ్రామాల్లోని ఇళ్ల వద్ద నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాలను దొంగిలించేవారు. ఇప్పటి వరకు నాలుగు ద్విచక్ర వాహనాలను అపహరించారు. వీటిలోని ఒక బైక్‌పై శనివారం ఇద్దరూ తిరుగుతుండగా పిల్లిగుండ్ల చెక్‌పోస్టు వద్ద పోలీసులు ఆపి తనిఖీ చేశారు. బైక్‌కు సంబంధించిన పత్రాలు చూపకపోవడంతో అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. దీంతో వారు బైక్‌లు దొంగిలించేవారిమని ఒప్పుకున్నారు. అనంతరం వసంతకుమార్ ఇంటి వద్ద ఉన్న రెండు బైకలతో పాటు కర్ణాటక రాష్ట్రం బడవనహళ్లిలో ఓ మెకానిక్ షాపు వద్ద పెయింటింగ్ వేయించేందుకు ఉంచిన మరో బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ వాహనాల్లో రొళ్ల మండలానికి చెందిన మూడు, గుడిబండ మండలానికి చెందిన ద్విచక్రవాహనాలుగా గుర్తించారు. నిందితులను అరెస్ట్ చేసి.. మడకశిర కోర్టులో హాజరు పరచగా.. న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు. సమావేశంలో ఎస్‌ఐ వీరాంజినేయులు, ఏఎస్‌ఐ బాలాజీ, జమేదార్ రమణ, కానిస్టేబుళ్లు షఫీ, నరసింహమూర్తి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం..
కోడిరంగనాథ స్వామి


కోడి రంగనాథస్వామి దేవాలయం


కోడి రంగనాథస్వామి

లేపాక్షి: శిరవరంలో వెలసిన కోడిరంగనాథస్వామి భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్నాడు. విజయనగర రాజుల కాలంలో ఆలయాన్ని నిర్మించినట్టు చరిత్ర ద్వారా తెలుస్తోంది. అయితే ఆలయం అభివృద్ధికి నోచుకోలేక ఉండిపోయింది. 1994లో అప్పటి సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటాచలయ్య ఈ దేవస్థానాన్ని సందర్శించారు. వారి కుటుంబ సభ్యులు భక్తులతో కలిసి ఆలయ జీర్ణోద్ధరణ, గ్రామసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకు వచ్చారు. వారి సహాయ సలహాల మేరకు శిరివరం కోడి రంగనాథ రాము రూ.లక్ష విరాళాన్ని దేవాలయానికి ట్రస్ట్ తరఫున 1995లో అనంతపురం రిజిస్ట్రారు కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. అప్పటి నుంచి కోడి రంగనాథస్వామి ట్రస్ట్ తరఫున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నేడు బ్రహ్మరథోత్సవం

కోడి రంగనాథస్వామి బ్రహ్మ రథోత్సవం ఆదివారం ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు విరివిరిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కలసి ఓడినా కలహం.. బలిగొంది ప్రాణం

- బెట్టింగ్ యాప్‌లో రూ.9 లక్షలు నష్టపోయిన నలుగురు స్నేహితులు
- నీ వల్లే ఓడామంటూ ముగ్గురు కలిసి ఒకరిపై తీవ్ర ఒత్తిడి
- అవమాన భారంతో స్నేహితుడి ఆత్మహత్య


కిషోర్‌కుమార్ (ఫైల్)


సుసైడ్ నోట్

ఉరవకొండ: నలుగురు స్నేహితులు. సులువుగా డబ్బు సంపాదించాలనుకున్నారు. ఎంతో ఆశతో బెట్టింగ్ యాప్‌లో రూ.లక్షలు పోశారు. లాభం కాదు కదా చిల్లిగవ్వ లేకుండా డబ్బంతా పోయింది. అయితే, కలసికట్టుగా ఆడిన వారు.. నష్టం వస్తే మాత్రం తట్టుకోలేక పోయారు. ముగ్గురు కలిసి తమ స్నేహితుడిపైనే తిరగబడ్డారు. నీ వల్లే జరిగిందని, తమ డబ్బు ఇవ్వాలని ఒత్తిళ్లు చేయడం ప్రారంభించారు. దీంతో మనస్తాపం చెందిన ఆ వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణం పొందాడు. ఉరవకొండలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుని బంధువులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. ఉరవకొండ పంచాయతీ కార్యాలయం సమీపంలో నివాసముంటున్న కిషోర్ కుమార్ (41) స్థానిక ముద్దలాపురం వద్ద ఉన్న సుజలాన్ విండ్ పవర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య సునీతతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వైఎస్సార్ జిల్లా చెన్నూరు సచివాలయంలో మహిళా పోలీసుగా సునీత విధులు నిర్వహిస్తున్నారు. తన స్నేహితులైన హరి, కేదార్, సంజయ్‌తో కలిసి కిషోర్ కుమార్ మూడేళ్ల నుంచి ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడేవారు. ఇటీవల నలుగురూ దాదాపు రూ.9 లక్షల వరకు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పోగొట్టుకున్నారు. ఇందుకు కారణం నువ్వేనంటూ కిషోర్‌కుమార్‌ను హరి, కేదార్, సంజయ్‌లు నిందించడం ప్రారంభించారు. డబ్బు తమకు తిరిగి ఇవ్వాలని తీవ్ర ఒత్తిడి తెచ్చారు. శనివారం ఇంటి వద్ద గొడవకు దిగారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన కిషోర్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్‌ఐ జనార్దన్ నాయుడు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

నా చావుకు స్నేహితులే కారణం..

ఆత్మహత్య చేసుకొనే ముందు కిషోర్ తన చావుకు ముగ్గురు స్నేహితులే కారణమని, వారి పేర్లు హరి, కేదార్, సంజయ్ అని ఒక పేపర్‌తో పాటు షర్టుపై పెద్ద అక్షరాలతో రాశాడు. డేటా బెట్టింగ్ యాప్‌లో పెట్టిన డబ్బు మొత్తం తననే కట్టమని తీవ్ర ఒత్తిడి చేశారంటూ అందులో పేర్కొన్నాడు.

కృత్రిమ గర్భధారణలో కష్టాలు

- పాత కంటైనర్లలో ద్రవ వీర్యం ఆవిరి..
- సెమెన్ ఇంజెక్షన్ల సరఫరాలో అక్రమాలు
- రూ.40 డోసుకు రూ.180 దాకా వసూలు
- పాడి రైతులను దోచేస్తున్న అక్రమార్కులు


కృత్రిమ గర్భధారణ చేస్తున్న పశు వైద్యాధికారి

రాయదుర్గం: పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ కష్టాలు వెంటాడుతున్నాయి. ఉత్తమ జన్యు లక్షణాలను అభివృద్ధి చేసి పాల ఉత్పత్తిని పెంచడంతోపాటు మేలు రకం పశు సంపద పెంపకానికి చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. ఆ దిశగా పాటుపడాల్సిన కూటమి సర్కార్ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఫలితంగా పాలిచ్చే పశువుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. నాణ్యమైన వీర్యాన్ని (లిక్విడ్ నైట్రోజన్–ఎల్ఎన్–2) సేకరించి డిమాండ్ ఆధారంగా సరఫరా చేయాల్సి ఉన్నా అనేక కారణాలతో లక్ష్యం నీరుగారుతోంది. పశు వైద్యశాలల్లో 35 కిలోల కంటైనర్లు, గోపాలమిత్రల వద్ద 3 కిలోల నిల్వ సామర్థ్యం కలిగిన కంటైనర్లు పాతవి ఉండడంతో ఒకసారి మూత తీసి పెడితే ద్రవ రూప వీర్యం నాణ్యత ప్రమాణాలు తగ్గిపోతున్నాయి. కొత్త కంటైనర్లు సరఫరా చేస్తేనే కృత్రిమ గర్భధారణ విషయంలో పాడి రైతులకు న్యాయం జరుగుతుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆవులు, గేదెలు దాదాపు 6.50 లక్షలు ఉన్నాయి. వీటిలో ఎదకు వచ్చే పశువులకు కృత్రిమ గర్భధారణ చేపట్టాలి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు తిరుపతి నుంచి 45 నుంచి 50 రోజులకు ఒకసారి లిక్విడ్ నైట్రోజన్–2 (ద్రవరూప వీర్యం) 14 వేల కిలోలు, అలాగే బనవాసి, నంద్యాల నుంచి సెమెన్ ఇంజెక్షన్ డోసులు 22 నుంచి 25 వేల దాకా సరఫరా అవుతున్నాయి. ఇంజెక్షన్ డోసులు కొన్ని చోట్ల ఉపయోగపడగా, మరిన్ని చోట్ల పక్కదారి పడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో పశువైద్యశాలల వివరాలు	
ఏరియా పశువైద్యశాలలు	30
పశువైద్య కేంద్రాలు	116
గ్రామీణ పశువైద్యశాలలు	36
ఆవులు, గేదెల సంఖ్య	6.50 లక్షలు
లిక్విడ్ నైట్రోజన్ (వీర్య ద్రవం) సరఫరా	14వేల కిలోలు
సెమెన్ డోసులు	22 నుంచి 25 వేలు

సెమెన్ ఇంజెక్షన్ పేరిట దోపిడీ..

సెమెన్ ఇంజెక్షన్ బయట మార్కెట్లో రూ.200కు దొరుకుతుంది. ప్రభుత్వ వైద్యశాలల్లో రాయితీ కింద రూ.40కే ఇవ్వాలి. కానీ రెండు జిల్లాల్లోనూ చాలా ఆస్పత్రుల్లో ఇంజెక్షన్లు లేవని చెబుతున్నారు. గోపాల మిత్రులు, ఇతర పశు మెడికల్ క్లినిక్‌లకు వాటిని చేర్చి పర్సంటేజీలతో కొందరు వ్యాపారం చేస్తున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో కొందరు గోపాల మిత్రులు రూ.150 నుంచి రూ.180 వరకు రైతుల నుంచి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాడి రైతుకు అదనపు భారం మోపుతున్నారు.

నమో నారసింహ..

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. నమో నారసింహ అంటూ భక్తుల నామస్మరణతో ఆలయప్రాంగణం మార్మోగింది. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, వైఎస్సార్, చిత్తూరు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఖాద్రీశుని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి.. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు


దీపాలు పెడుతున్న మహిళలు